## క్లుప్తంగా

### కలెక్టర్‌కు చిత్రపటం బహూకరణ



మహబూబాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ఏకశిల పాఠశాల విద్యార్థి కె.శివ కార్తికేయ కలెక్టర్ శశాంక చిత్రం గీసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అందజేశాడు.

### నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

గార్ల: రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్ ఏఈ, సిబ్బంది విఫలమయ్యారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సురేష్‌నాయక్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మహబూబాబాద్ విద్యుత్ డీఈకి రైతులతో కలిసి ఆయన ఫిర్యాదు చేశాడు. రైతులు మాన్‌సింగ్, మల్సూర్, సైదులు, సర్వన్, కిషన్, మోతీలాల్, జగ్గు, తదితరులు పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి

నెల్లికుదురు: దివ్యాంగుడని చూడకుండా దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల జిల్లా, రాష్ట్ర సంఘం (టీఆర్‌వీఎస్) బాధ్యులు సునీల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నర్సింహుల గూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వనగండ్ల నరేష్‌పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు అకారణంగా భౌతిక దాడి చేశారన్నారు. నరేష్‌కు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### సామర్థ్యాలు పెంపొందించాలి

తొర్రూరు: ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుపై డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న జిల్లా స్థాయి శిక్షణా శిబిరంలో ఎంఈఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి తుమ్మ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు బీవీ రావు, రఘునందర్, మధు పాల్గొన్నారు.

### పోరాటానికి గుర్తింపు దక్కింది

మరిపెడ: ఏడేళ్ల పోరాట ఫలితంగానే మినీ, ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కావడం జరిగిందని మరిపెడ, చిన్నగూడూరు మినీ అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. ఈసందర్భంగా మరిపెడ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శిరీషను మినీ అంగన్‌వాడీ టీచర్లు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మినీ అంగన్‌వాడీల రాష్ట్ర అధ్యక్షురాలు అడప వరలక్ష్మికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, నాగమ్మ, శివమ్మ, సుజాత, చంద్రమతి, రజిత, రోజా, సరిత, సౌందర్య, విజయ, జ్యోతి పాల్గొన్నారు.

### సమ్మె నోటీస్ అందజేత

నెహ్రూసెంటర్: ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రుక్మద్దీన్ అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 31వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు ఉద్యోగులు డీఎంహెచ్‌ఓ అంబరీషకు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సామిత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, యగ్నేశ్వర్, అశోక్, నీలిమా, ఉమాకర్, శేషాద్రి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

### పాదయాత్ర

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసేందుకుగాను, ఇనుగుర్తి మండల కేంద్రం నుంచి యూత్‌కాంగ్రెస్ నాయకులు గుజ్జునూరి వినోద్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంకు పాదయాత్రగా బయలుదేరారు. ఈసందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావడం సంతోషకరమని, ఆయన గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అజయ్‌గౌడ్, రాకేష్, సంపత్, ప్రవీణ్, గణేష్, బాబు, మామిడి జనార్దన్, నాగెల్లి సుధీర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తొర్రూరు: 40 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన మిత్రులంతా సుదీర్ఘ విరామం అనంతరం కలిసి సందడి చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982-83 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం డివిజన్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులు కృష్ణారెడ్డి, చంద్రయ్య, రంగారెడ్డి, రాములును సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇమ్మడి రాంబాబు, కావేరి వెంకన్న, డాక్టర్ వై. ఉపేందర్, ముత్తినేని జయప్రకాష్, అరుణ, నాగేశ్వర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటలు చెబితే నమ్మొద్దు

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- గొర్రెల యూనిట్లు, ఇంటి స్థలాల పంపిణీ
- డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన

కేసముద్రం: ఎన్నికల సమయంలో వలసలు వచ్చిన కొందరు చెప్పే మాయమాటలు వింటే మోసపోతారని, ఆ తర్వాత ఐదేళ్లపాటు మనం గోసపడాల్సి వస్తుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను, 49 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 44మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, బలిదానాలతో కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి, ఎవరో ఢిల్లీ పాలకులు వచ్చి మాయమాటలు చెబితే ఎవరూ నమ్మవద్దన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలించే రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలు అమలవుతున్నాయా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ నరేష్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, సర్పంచ్ ఎన్నమాల ప్రభాకర్, నాయకుడు నీలం దుర్గేష్, వైస్ ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న పాల్గొన్నారు.



కేసముద్రం: గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మహబూబాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే పరామర్శ**

ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఈమేరకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కిషన్ ఇంటికి వెళ్లి పరామర్శించాడు.

**అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇస్తాం..**

మహబూబాబాద్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని సాలార్ తండా సమీపంలో నిర్మాణం చేసే 30 డబుల్ బెడ్రూం ఇళ్లకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్ మార్నేని వెంకన్న డీఈ సీహెచ్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

**డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది**

గూడూరు: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న డప్పు కళాకారులను ప్రభుత్వం తప్పకుండా ఆదరిస్తుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని పొనుగోడుకు చెందిన డప్పు కళాకారుల బృందం సర్పంచ్ నలమాస వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం 3వసారి టికెట్ పొందిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పూల బొకే అందజేశారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు**

మండలంలోని గుండెంగ, గూడూరు శివారు వడ్డెర గూడేనికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు గుండెంగ ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్, వడ్డెరగూడెం వల్లెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కందిక రాజు, మాదాసు ఎల్లయ్య, గుగులోతు బిచ్చు, బానోతు వెంకన్నలతోపాటు మరో 50మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి.ఖాసిం, చీకటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# మానవ అక్రమరవాణాను అరికట్టాలి

మరిపెడ రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతీ ఒక్కరు నడుం బిగించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. మరిపెడ మండలం లచ్చ తండ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ మరిపెడ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈశిక్షణ కార్యక్రమానికి మొదటి రోజు సోమవారం ముఖ్యతిథిగా సీడీపీఓ శిరీష, ప్రజ్వల సీనియర్ కోఆర్డినేటర్ చంద్రయ్య, హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమ మానవ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ నిర్వాహకులు శ్రీకాంత్, శ్రావ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, పద్మ, రాణి, కవిత, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కురవి: మానవ అక్రమ రవాణా నివారణ అందరి బాధ్యత అని హైదరాబాద్ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. సోమవారం ప్రజ్వల సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ మహబూబాబాద్ జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో మానవుల అక్రమ రవాణాపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం కురవిలోని రైతువేదికలో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, శివ, సూపర్‌వైజర్ రమణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీఓ శిరీష

# మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి



బాధిత రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తొర్రూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు అధిక సంఖ్యలో హాజరై మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మార్క్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 8గంటలకు పోలెపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన, 9గంటలకు అరిపిరాలలో ఆయిల్‌పామ్ నర్సరీ కార్యాలయ భవనం ప్రారంభం, 10గంటలకు గోపాలగిరిలో పామాయిల్ కంపెనీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

**న్యాయం చేయాలి**

పామాయిల్ కంపెనీ ఏర్పాటుకు భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను కోరారు. గతంలో ప్రభుత్వం పేద రైతులకు ఉచితంగా భూములు ఇవ్వగా, కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఇప్పుడు కంపెనీ ఏర్పాటుకు అధికారులు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్యపై స్పందించిన తహసీల్దార్ విజయ్‌కుమార్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లి తగిన విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# జంగాలపల్లిలో పోలీసుల కార్డన్ సెర్చ్

గంగారం: మండలంలోని జంగాలపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు గూడూరు సీఐ ఫణిదర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ సోమవారం నిర్వహించారు. ఈ సోదాల్లో 20 లీటర్ల గుడుంబా, అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, 120 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే వారిపై రౌడీ షీట్లను సైతం ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై దిలీప్, గూడూరు ఎస్సై రాణాప్రతాప్, ఆర్ఎస్సై శేఖర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న సీఐ

## విచారణ చేపట్టాలి

డోర్నకల్: విద్యాశాఖలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లపై విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. అక్రమ డిప్యుటేషన్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ఎంఈఓ పూల్‌చంద్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మట్లాడుతూ.. ఎంఈఓపై చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రంగు అజయ్‌కుమార్, దేవేందర్, వినయ్, సంజయ్ పాల్గొన్నారు. ఎంఈఓ పూల్‌చంద్‌పై చర్య తీసుకోవాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ డిమాండ్ చేశారు.

## గొర్రెల పంపిణీ

పెద్దవంగర: మండలంలోని చిట్యాల గ్రామంలో సోమవారం సర్పంచ్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

# లబ్ధిదారుల ఎంపికలో నాయకుల జోక్యం

కురవి: అధికారుల ద్వారా దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, పార్టీ టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపిక బీఆర్ఎస్ నాయకులు చేయడం అన్యాయమన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎస్సీలకు అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు ఇస్తామని తెలిపారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలగాని శ్రీను, మాలోత్ లింగ్యానాయక్, కామిండ్ల వీరన్న, మిర్యాల లక్ష్మయ్య, కామిండ్ల ఆనందం, మండల రాంచంద్రు, కొర్ని అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

# అన్ని పార్టీల్లో శ్రేయోభిలాషులు ఉన్నారు..

- బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని పార్టీల్లో తనకు శ్రేయోభిలాషులు ఉన్నారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో నిర్వహించిన బీజేపీ సభకు మానుకోట నుంచి వేలాదిగా ప్రజలు తరలివెళ్లడం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే భూ కబ్జాలు, భూ దందాలు పెరుగుతాయని ప్రజలు భయపడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మానుకోట గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి ఇంటింటికి హుస్సేన్‌నాయక్ ప్రజల ఆశీర్వాద కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మం సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్, అసెంబ్లీ అధ్యక్షుడు మురళి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నవీన్ నాయుడు, నాయకులు సిద్ధార్థ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

# కనీస మద్దతు ధర చట్టం అమలు చేయాలి

నెహ్రూసెంటర్: రైతుల పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఎస్‌కేఎం జిల్లా సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని, ప్రధాని పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మండల వెంకన్న, దేవేందర్, వెంకన్న, రాజన్న, సుధాకర్, వీరన్న, సైదులు, సక్రు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భిక్షపతి

# పథకాల అమలులో ఎమ్మెల్యేల అతిజోక్యం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాసంక్షేమ సమరం కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు ఎమ్మెల్యేల అతిజోక్యం లేకుండా చూడాలని, వార్డు గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం రూ రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జీఓ 59పేరుతో పేదలపై భారం మోపడం సరికాదన్నారు. అర్హులకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, నవీన్, సాంబలక్ష్మి, శ్రావణ్, లింగ్యా, శంకర్, వేణు, యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు 'డయల్ యువర్ డీఎం'**

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జలగం విజయ్ సోమవారం తెలిపారు. డిపో అభివృద్ధికి ప్రజలు, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ఫోన్ 99592 26054 నంబర్‌లో అందజేయాలన్నారు.

**వాహనాల తనిఖీ**

మహబూబాబాద్ రూరల్: ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని టౌన్ ఎస్సైలు విజయరాంకుమార్, దీపికరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

**క్షీరాభిషేకం**

గార్ల: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించడంపై సోమవారం గార్లలో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించి, బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణగౌడ్, వెంకట్రామయ్య, వెంకట్‌లాల్ పాల్గొన్నారు.

**టీఎల్ఎం ఫ్లెక్సీల ఆవిష్కరణ**

బయ్యారం: బోధనాభ్యసనకు ఉపయోగపడే వందరకాల టీఎల్ఎం ఫ్లెక్సీలను మండలంలోని పందిపంపుల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏసీఎంఓ ఈరులాల్, ఏటీడీఓ భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అల్లిగూడెం సర్పంచ్ సుభద్ర, ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం బాబు, హెచ్ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

**అక్రమ కేసులు ఎత్తివేయాలి**

డోర్నకల్: నల్లగొండ డీసీఎంఎస్ చైర్మన్ ఒట్టే జానయ్యయాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని భారత యాదవ సమితి జిల్లా యువజన నాయకులు దాసరి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ప్రోద్బలంతో జానయ్య యాదవ్‌పై అక్రమ కేసులు బనాయించారని, అక్రమ కేసులు ఎత్తివేయకుంటే యాదవులంతా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతారని హెచ్చరించారు.

**వైద్యశిబిరం**

పెద్దవంగర: మండలంలోని పోచారం గ్రామంలో ప్రభుత్వ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, సర్పంచ్ నూనవత్ లక్ష్మీబాలు, కార్యదర్శి ఫణికుమార్ పాల్గొన్నారు.

**వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకావాలి**

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో రేపు నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ, గురుకులం, ప్రైవేట్ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కాంప్లెక్స్ హెచ్ఎం బి.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌రెడ్డి కోరారు.

**చెక్కు అందజేత**

మరిపెడ: మండలంలోని వీరారం గ్రామానికి చెందిన ఏర్పుల మల్లయ్యకు ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన రూ.35వేల చెక్కును ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్‌తో కలిసి ఎంపీపీ అరుణ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్, బాలకిషన్, సూపరింటెండెంట్ శేషశైలం, ఉపసర్పంచ్ లింగయ్య పాల్గొన్నారు.

**గొర్రెలు పంపిణీ చేయాలి**

బయ్యారం: గొర్రెల కోసం డీడీలు కట్టిన గొల్ల, కురుమలందరికీ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయాలని బయ్యారం గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షుడు బండారి మల్లయ్య సోమవారం డిమాండ్ చేశారు.

**ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి**

గూడూరు: ప్రభుత్వం వెంటనే జీఓ నంబర్ 3ను అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దనసరి రాజేష్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలుకాని పథకాలతో అడవులకు దగ్గరగా ఉండే ఆదివాసీ గ్రామాలకు అభివృద్ధి పథకాలు వర్తించకుండా, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తాటి సుధాకర్, దారం నరేష్, దారం సాంబరాజు పాల్గొన్నారు.

**విజయవంతం చేయాలి**

కేసముద్రం: యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్‌లో భాగంగా ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చీకటి వెంకట్రామనర్సయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చాడు.

**సంక్షేమ పథకాలపై ప్రచారం**

నెల్లికుదురు: మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ పథకాలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆరెపల్లి నరేష్, కళాకారులు రవీందర్ గౌడ్, కుమారస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

**విద్యార్థులు ఇష్టపడి చదవాలి**

పెద్దవంగర: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే విద్యలో రాణిస్తారని ఇన్‌చార్జ్ ఎంఈఓ రాము, నోడల్ అధికారి అల్లందాసు భిక్షపతి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని వారు సందర్శించారు. పాఠశాల్లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**కోఆర్డినేటర్‌గా యాకయ్య**



తొర్రూరు: లయన్స్ క్లబ్ క్వెస్ట్ ప్రోగ్రాం రీజియన్ కోఆర్డినేటర్‌గా రాయిపల్లి యాకయ్య నియమితులయ్యారు. ఈమేరకు లయన్స్‌క్లబ్ గవర్నర్ ఎన్ వీరావు, ఎస్‌వీడీజీ చంద్రశేఖర్ ఆర్య యాకయ్యకు బాధ్యతలు అప్పగించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్లు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.

**ఆలయంలో చోరీ**

కురవి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై నిర్మించిన యాదవుల కులదైవం గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని వెండి హారతి ప్లేట్, స్టీల్ హుండీలోని డబ్బులు, వెండి తీర్థం ఉద్ధరినీ, వెండి చెంచా ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు రాము, మహేష్ తెలిపారు. దొంగతనం విషయంపై కురవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం క్లూస్‌టీం బృందం వచ్చి ఆలయంలో ఫింగర్‌ప్రింట్స్ సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గోపి తెలిపారు.

# వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నెహ్రూసెంటర్: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఒయిబ్రెయిల్ కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జెండాను వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు చలగోల వెంకన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ జిల్లా కోకన్వీనర్ పోలేపాక ప్రవీణ్, నాయకులు బుడిగే శ్రీరాములు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ రాంపల్లి వెంకన్న, రాజయ్య పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

## రెగ్యులరైజ్ చేయాలని నిరసన

మహబూబాబాద్: తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్‌లో వినతి అందజేశారు. బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెయిటేజీ కల్పించడంతోపాటు మూలవేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జానకీ రాము, మల్లేషం, భిక్షపతి, వీరన్న, బాస్కర్‌రావు పాల్గొన్నారు.

## పథకాల అమలులో ప్రగతి సాధించాలి

మహబూబాబాద్: ప్రభుత్వ పథకాల అమలులో ప్రగతి సాధించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు పథకాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, పథకాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జీఓ 59కింద భూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. కారుణ్య నియామకాలు పూర్తి చేశామన్నారు. వీసీలో జెడ్పీ సీఈఓ రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అకడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్‌చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థుల చదువు సామర్థ్యాలపై ఆరా తీశారు. అన్నివర్గాల ప్రజలు తమ పిల్లలను సర్కారు బడులకే పంపించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.